క్లుప్తంగా

ద్వారంపూడి రంజాన్ శుభాకాంక్షలు

కాకినాడ: సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ముస్లింలకు రంజాన్ నెల శుభాకాంక్షలు తెలిపారు. నెలవంక దర్శనమివ్వడంతో రంజాన్ ఉపవాస దీక్షలు ఆరంభమైన నేపథ్యంలో ముస్లింలకు అంతా మంచి జరగాలని ఆయన పేర్కొన్నారు. కఠోర ఉపవాస దీక్షలతో ముస్లింలు చేసే ప్రార్థనలు ఫలితంగా ప్రజలకు, రాష్ట్రానికి మేలు జరగాలని ఆకాంక్షించారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



ఏబీసీపై వివరిస్తున్న ప్రొఫెసర్ రామ్మోహనరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జాతీయ విద్యా విధానం ద్వారా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహనరావు అన్నారు. 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ) విధానాలు, ప్రక్రియలు, సమ్మతి' అనే అంశంపై జేఎన్టీయూకేలో సోమవారం వర్క్‌షాపు నిర్వహించారు. డిస్టెన్స్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రామ్మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలోని ఏబీసీ ద్వారా విద్యార్థులు ఉన్నత విద్యాసంస్థల్లో డిగ్రీ, డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు పూర్తి చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ఏబీసీని అనుసరిస్తున్న విద్యా సంస్థలు అందించే క్రెడిట్‌లను విద్యార్థుల ఖాతాల్లో డిపాజిట్ చేస్తారని తెలిపారు. జేఎన్టీయూకే ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ, విద్యార్థులందరికీ ఏబీసీ ఐడీలు రూపొందించడంతో పాటు, 2020–21 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారికి ఈ నెల 31లోగా గ్రేడ్ షీట్లు ప్రచురిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డీఈ బాలకృష్ణ, వివిధ వర్సిటీలకు చెందిన 70 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల పరిశీలన

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎస్ఈబీ అడిషన్ ఎస్పీ శ్రీలక్ష్మి

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో భద్రతా చర్యలపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. సర్పవరం పోలీసు స్టేషన్ పరిధిలో పావులాలతూము, వాకలపూడి హైస్కూల్ తదితర చోట్ల సోమవారం ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి పర్యటించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలతో సమావేశం నిర్వహించి, ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు.

లయన్స్ క్లబ్ వితరణ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు సోమవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లాల బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు హాజరై, క్లబ్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ప్రసూన, కార్యదర్శి శ్రీదేవి రెడ్డి, సభ్యులు రమాసుందరి, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పాల వెల్లువ కేంద్రం ప్రారంభం

కాకినాడ రూరల్: పాడి రైతులకు అందుబాటులో ఉండేలా పాల వెల్లువ కేంద్రాలను ప్రభుత్వం తెచ్చిందని జేసీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. గంగనాపల్లిలో సచివాలయం వద్ద నిర్మించిన జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని సోమవారం సర్పంచ్ గీసాల మహాలక్ష్మి ప్రారంభించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

బోట్‌క్లబ్: గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న 240 మంది విద్యార్థులకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు సోమవారం పరీక్షా సామాగ్రి అందజేశారు. పరీక్ష రాసే అట్టలు, పెన్లు, పెన్సిళ్లు, స్కేళ్లు ఉన్న కిట్లను అందించారు.

కట్నం వేధింపులపై కేసు

కరప: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గొర్రిపూడి గ్రామానికి చెందిన శ్రీపాదం లోవరాజుతో అదే గ్రామానికి చెందిన వెంకటలక్ష్మికి 2010లో పెళ్లయింది. మద్యానికి బానిసైన లోవరాజు కట్నం తేవాలని భార్యను వేధించాడు. ఏడాది క్రితం ఇంటి నుంచి గెంటేశాడు. పెద్దల వద్ద రాజీ చర్యలు విఫలమయ్యాయి. ఈ మేరకు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కరప: అనారోగ్య బాధలు తట్టుకోలేక పురుగు మందు తాగిన వృద్ధుడు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మరణించాడు. ఏఎస్సై వి.సూరిబాబు కథనం ప్రకారం.. వేములవాడకు చెందిన జ్యోతుల సత్యసాయిబాబు(64) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నెల పదిన పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని భార్య కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ సోమవారం చనిపోయాడు.

హామీలన్నీ నెరవేర్చిన జగనన్న



కరపలో వైఎస్సార్ ఆసరా, చేయూత చెక్కులను మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



భారీ బహిరంగ సభకు హాజరైన మహిళలు



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరాకు రూ.160 కోట్లు, వైఎస్సార్ చేయూతకు రూ.79.75 కోట్ల పంపిణీ
- భారీ బహిరంగ సభలో ఎమ్మెల్యే కన్నబాబు

కరప: అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి, అన్నట్టుగానే మాఫీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. మహిళలకు అండగా నిలబడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలతో వారి ఆర్థికాభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో సోమవారం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన భారీ బహిరంగ సభ జరిగింది. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 4,892 మహిళా శక్తి సంఘాల్లో 49,070 మంది సభ్యులుండగా, వారి రుణాలను నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.160 కోట్లు మాఫీ చేశారన్నారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.79.75 కోట్ల లబ్ధి చేకూర్చారని వివరించారు. కరప మండలంలో 1,595 సంఘాల్లోని 16,050 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరాలో రూ.55.12 కోట్ల రుణమాఫీ చేసినట్టు తెలిపారు. వైఎస్సార్ చేయూతలో రూ.26.48 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూర్చామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 32 సంక్షేమ పథకాల ద్వారా కరప మండలంలో రైతులకు, మహిళలకు, వివిధ సామాజిక వర్గాల వారి ఖాతాల్లోకి నేరుగా రూ.650 కోట్లు జమ చేసినట్టు తెలిపారు. 2014 ఎన్నికల సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు డ్వాక్రా, రైతుల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారని, అమలు చేశారా అని సభనుద్దేశించి ప్రశ్నించగా, లేదు.. లేదంటూ మహిళలు ముక్తకంఠంతో సమాధానమిచ్చారు. చంద్రబాబు పదవీ కాలం ముగిసే సమయంలో పసుపు కుంకుమ పేరిట ప్రతి మహిళకు రూ.10 వేల ఆర్థికసాయం, సెల్‌ఫోన్ ఇస్తానన్నారని, ఇచ్చారా అంటూ కన్నబాబు ప్రశ్నించగా, లేదంటూనే మహిళలు బదులిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మంటపాలు, 125 ఆలయాలు నిర్మించామని కన్నబాబు వివరించారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఎన్నికల హామీలు 99 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించి, ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అందుకు ఎమ్మెల్యేగా తనకు, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడతగా రూ.13.70 కోట్లు, వైఎస్సార్ చేయూత కింద రూ.6.85 కోట్ల చెక్కును మహిళా శక్తి సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే కన్నబాబు అందజేశారు. మహిళా సభ్యులతో కల్సి ఎమ్మెల్యే కన్నబాబు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మేడిశెట్టి గనిలక్ష్మి, ఏపీఎం ఎంఎస్‌బీ దేవి, ఎంపీడీఓ కె.అప్పారావు, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, బండే తాతాజీ, చిన్నం వెంకటేశ్వరరావు, మార్నెళ్ల వెంకటరమణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదలకు సంపూర్ణ హక్కే సీఎం లక్ష్యం

కాకినాడ రూరల్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరు చేసిన ఇళ్ల స్థలాలపై ప్రజలకు సంపూర్ణ హక్కు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక పిఠాపురం రోడ్డులోని జేఎన్టీయూకే సమీపంలోని గ్రౌండ్స్‌లో సోమవారం రూరల్ డివిజన్లకు సంబంధించిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల పత్రాల పంపిణీ జరిగింది. 1,2,3,42,48,49,50 డివిజన్లకు సంబంధించి 4,002 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, రాష్ట్ర సివిల్స్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, ఆయా డివిజన్ ఇన్‌చార్జులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ స్థలాలు మంజూరు చేసి, ఇంటి నిర్మాణం కూడా చేపడుతున్నారన్నారు. ఇళ్ల స్థలాలతో పాటు సకల మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,300 కోట్లు, అభివృద్ధికి సంబంధించి రూ.650 కోట్లతో ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించామన్నారు. ఎన్నికలు సమీపించడంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నారని, వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి మాటలు నమ్మితే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నగరపాలక సంస్థ మేనేజర్ కర్రి సత్యనారాయణ, మెప్మా సీఎంఎం దేగల వెంకటరాజు, ఆయా డివిజన్ ఇన్‌చార్జులు వడ్డి మణికుమార్, ఐ.శ్రీను, రాజారపు కృష్ణ, పాటి సూరిబాబు, కడియాల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి, మహాలక్ష్మినగర్ గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. మహాలక్ష్మినగర్‌లో రూ.50 లక్షలతో నిర్మించిన సంక్షేమ సంఘ భవనం, డ్రైవర్స్ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన సంక్షేమ సంఘం భవనం, రూ.5 లక్షలతో అభివృద్ధి చేసిన ఏఎస్ఆర్ పార్కును, సగరపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన భగీరథ సగర కమ్యూనిటీ భవనాలను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో యువకుల చేరిక

ఆహ్వానించిన ఎమ్మెల్యే ద్వారంపూడి



వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాకినాడ 6, 7 డివిజన్ల పరిధిలోని రేచర్లపేటకు చెందిన సుమారు 50 మంది యువకులు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తన నివాసంలో వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీకేటి సారథి, బత్తిన రాజు ఆధ్వర్యంలో నక్కపల్లి కిషోర్, చెవ్వేటి లావణ్యకుమార్ మిత్ర బృందం పార్టీలో చేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ పార్టీ విధానాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరిన యువత, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కష్టించి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, రోకళ్ల సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ స్కిల్ కళాశాలలో ఉచిత శిక్షణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సీడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 2020–23లో బీటెక్ పూర్తిచేసిన యువతీ యువకులకు ఉచిత శిక్షణ, వసతి కల్పిస్తున్నట్టు డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబెడెడ్ ప్రొడక్ట్ డిజైనర్ విభాగంలో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని చెప్పారు. 19 నుంచి 30 ఏళ్లలోపు ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, బీఈ అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. వివరాలకు 97033 33946 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ముస్లిం వ్యతిరేకులతో బాబు దోస్తీనా!

- టీడీపీలోని మైనార్టీలూ బయటకు రండి
- వైఎస్సార్ సీపీ మైనార్టీ నేతల హితవు



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీల ప్రతినిధులు

కాకినాడ: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించిన బీజేపీతో స్వార్థ రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా చంద్రబాబు జతకట్టడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలీద్ బిన్‌వలీ విమర్శించారు. సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో మైనార్టీసెల్ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్న బీజేపీతో చంద్రబాబు చేస్తున్న చెలిమి మైనార్టీలపై ఆయనకున్న వ్యతిరేకతను తెలియజేస్తోందన్నారు. ఎల్లప్పుడూ ముస్లిం మైనార్టీలు ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించిన వైఎస్సార్ నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. వాటిని రద్దు చేస్తామని నిస్సిగ్గుగా ప్రకటించిన బీజేపీతో టీడీపీ కలిసిన తీరును ఆయన దుయ్యబట్టారు. తక్షణమే టీడీపీలో ఉన్న మైనార్టీలంతా ఆ పార్టీకి రాజీనామా చేయాలని హితవు పలికారు. మైనార్టీ నాయకులు ఖాన్ మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముస్లిం మైనార్టీలు బలపరచాలన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ లాల్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నాయకత్వాన్ని బలపరిచి, ఆయన విజయానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాషా, నాయకులు అజ్జు, మున్నా, కరీం, నవాబు, జాఫర్, సాజిద్, కొత్తపేట మున్నా, హేమంత్, జిలానీ పాల్గొన్నారు.

మత్స్యకారుల ఉపాధికి విఘాతం

సమస్యలు పరిష్కరించాలని మత్స్యకార నేతల డిమాండ్

కాకినాడ సిటీ: కోనపాపపేటలో ఓఎన్‌జీసీ పైపులైన్లకు వ్యతిరేకంగా పోరాడుతున్న మత్స్యకారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మత్స్యకార, మత్స్య కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. కాకినాడ సుందరయ్య భవన్‌లో సోమవారం మత్స్యకార నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా తీరప్రాంతం నుంచి మత్స్యకారులను తరిమివేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లాలో కోనపాపపేట గ్రామంలోను, కాకినాడ నగరానికి ఆనుకుని ఉన్న ఏటిమొగ ఓఎన్‌జీసీ చమురు బావి కంపెనీ పైపులైన్లు వేయడం వల్ల, సముద్రంలో వేటాడడానికి అవకాశం లేకుండా వలలు చిరిగిపోయాయని, గుంతలు ఏర్పడడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. సముద్రంలో వేటాడినా చేపలు పడకపోవడం వల్ల మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. వారికి తక్షణమే శాశ్వత నష్ట పరిహారం గ్యారంటీ ఇవ్వాలన్నారు. స్థానిక పంచాయతీల తీర్మానాలు లేదా పబ్లిక్ హియరింగ్ తీర్మానాలు లేకుండానే విషతుల్య ఫార్మా కంపెనీలకు కాలుష్య నియంత్రణ మండలి, మత్స్య, అటవీ, రెవెన్యూ శాఖలు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం వల్ల మత్స్యకారుల ఉపాధికి భంగం వాటిల్లుతోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు కర్రి చంద్రశేఖర్, సీహెచ్ రమణి, వైదాని శివ, మల్లాడి రామకృష్ణ, ఓలేటి మహేష్, ఎం.శివకుమార్, జి.భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పడమటి సంధ్యారాగం–2 చిత్రం



చిత్రం వివరాలు తెలుపుతున్న మీర్ అబ్దుల్లా

బోట్‌క్లబ్: ఒకప్పుడు విజయవంతమైన పడమటి సంధ్యారాగం చిత్రానికి సీక్వెల్‌గా పడమటి సంధ్యారాగం-2 చిత్రం రూపుదిద్దుకోనుంది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుందని దర్శకుడు, నటుడు మీర్ అబ్దుల్లా తెలిపారు. కాకినాడలోని ఓ హోటల్‌లో సోమవారం ఆయన విలేకరులకు ఈ చిత్రం విశేషాలను వివరించారు. 1987లో హాస్యబ్రహ్మ జంధ్యాల దర్శకత్వంలో అమెరికాలో నిర్మించిన పడమటి సంధ్యారాగం సినిమా అప్పట్లో సూపర్‌హిట్ అయిందన్నారు. ఆ సినిమాలో తాను నటించడమే కాకుండా, సహ నిర్మాతగానూ వ్యవహరించానని చెప్పారు. ఇదే పంథాలో పడమటి సంధ్యారాగం-2 సినిమా తీస్తున్నట్టు చెప్పారు. కొత్త నటీనటులకు ఈ సినిమాలో అవకాశం కల్పిస్తామన్నారు. కాకినాడ, పరిసర ప్రాంతాల్లో చిత్ర షూటింగ్‌కు అనువైన ప్రాంతాలను అన్వేషిస్తున్నామన్నారు. ఈ సినిమా కథ, కథనం తయారవుతున్నాయన్నారు. నవ్వులు కురిపించే విచిత్రమైన పాత్రలు, హాస్య సన్నివేశాల కోసం చర్చలు జరుగుతున్నాయన్నారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, ఇంగ్లిష్, తమిళం, రష్యన్, చైనా భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కొత్త కళాకారులను, దర్శకులను చిత్ర పరిశ్రమకు పరిచయం చేయడమే తన లక్ష్యమన్నారు.

ముసాలమ్మకు ప్రత్యేక పూజలు

కరప: వేములవాడ గ్రామ దేవత ముసాలమ్మ తల్లి పునః ప్రతిష్ఠా వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇళ్ల స్థలాల కోసం కలెక్టర్‌కు వినతి

కాకినాడ సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాతాడ నవీన్‌రాజ్, ముమ్మిడి లక్ష్మణ్, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించాలని కలెక్టర్‌ను కోరారు.

గోపాల్ మిత్రల ధర్నా

కాకినాడ సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువులకు సేవలందించే గోపాలమిత్రలను రెగ్యులర్ చేయాలని సోమవారం కాకినాడలో ధర్నా నిర్వహించారు. గోపాలమిత్రలు రాత్రి పగలు కష్టపడుతున్నారన్నారు.

స్థలాలు పొందిన వారందరికీ ఇళ్లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సభకు హాజరైన మహిళలు



తరగతి గదుల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి

- 18 నెలల వ్యవధిలో పూర్తి చేస్తా
- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో స్థలాలు పొందిన ప్రతి లబ్ధిదారునికి 18 నెలల వ్యవధిలో ఇళ్ల నిర్మాణాలను కూడా పూర్తి చేసి అప్పగిస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేకరరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం తన ఏకైక లక్ష్యం పేదల సొంతింటి కల సాకారమేనన్నారు. స్థానిక జగన్నాథపురం 21, 22, 23, 24, 25 డివిజన్లకు చెందిన సుమారు 1,175 మంది లబ్ధిదారులకు జి.వేమవరంలో కేటాయించిన ఇళ్ల స్థలాల అప్పగింత ప్రక్రియ సోమవారం జరిగింది. లబ్ధిదారులను అక్కడికి తీసుకువెళ్లి కేటాయించిన స్థలాలను చూపించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు పది వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే 30 వేల మంది అర్హులుగా తేలడంతో ప్రతి ఒక్కరికీ స్థలాలు ఇచ్చామన్నారు. ఇచ్చిన స్థలాల్లో సుమారు పది వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఏది ఏమైనా తన అంతిమ లక్ష్యం అర్హత కలిగిన పేదలందరికీ గృహ నిర్మాణమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, ఆయా డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పాఠశాలలకు మహర్దశ

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యారంగంలో తీసుకున్న విప్లవాత్మక సంస్కరణల వల్ల ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక సాలిపేటలో పైడా సత్తిరాజు బాలికోన్నత పాఠశాలలో రూ.2.36 కోట్ల వ్యయంతో నాడు–నేడు పథకంలో నిర్మించిన పది అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో తీసుకున్న చర్యలు సత్ఫలితాన్నిచ్చాయన్నారు. విద్యా ప్రమాణాలు పెంచి అత్యాధునిక వసతులు కల్పించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లకు డిమాండ్ పెరిగిందన్నారు. అమ్మ ఒడి వంటి పథకాలు కూడా పాఠశాలల ప్రగతికి దోహదపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ పి.వెంకటరావు, ఏఈ రమేష్, జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు మన్నే నాగేశ్వరరావు, బీసీసెల్ కార్యదర్శి బెజవాడ బాబీ, హెచ్ఎం సుబ్బలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా స్పందన దరఖాస్తుల పరిష్కారం

కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు ఆదేశం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పందనలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 16 మంది పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ సహా వివిధ విభాగాల సమస్యలపై వినతులు ఇచ్చారు. వీటిని సత్వరమే పరిష్కరించాల్సిందిగా అక్కడున్న అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ న్యాయ సంబంధ, ఆర్థిక పరమైనవి మినహా మిగిలిన ప్రతి సమస్యను వేగంగా పరిష్కరిస్తామని చెప్పారు. పరిష్కారమైన సమస్యల వివరాలను ఫిర్యాదుదారులకు కూడా తెలియజేస్తామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు. ఆ దరఖాస్తులకు కూడా తగిన ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్ ప్రక్రియపై దృష్టి పెట్టండి

కాకినాడ: అనారోగ్యంతో మంచానపడ్డ బాధితులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతం పైబడి వైకల్యం కలిగిన దివ్యాంగులు హోమ్ ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఇంటి వద్దే ఓటు వేసుకునే వెసులుబాటును కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందని సిటీ నియోజకవర్గ ఆర్ఓ, కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. సోమవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో తహసీల్దార్ దొర, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు సీతాపతిరావు, నాయుడు, ఇతర ఎన్నికల సిబ్బందితో ఎన్నికల ప్రక్రియపై సమీక్షించారు. ప్రధానంగా ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానాన్ని, ఇతర అంశాలను వివరిస్తూ మిగిలిన ఉద్యోగులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా హోం ఓటింగ్‌కు సంబంధించి అర్హత కలిగిన ఓటర్లను ఎంపిక చేసే బాధ్యతను బీఎల్ఓలు, సెక్టార్ అధికారులు చూస్తున్నారని, వచ్చిన ప్రతిపాదనలను స్వయంగా పరిశీలించి నివేదిక ఇస్తారన్నారు. గుర్తించిన హోమ్ ఓటింగ్ ఓటర్లు పోలింగ్ తేదీన ఓటు వేసేందుకు అనువైన పరిస్థితులు ఉండేలా సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇందుకోసం బృందాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటు వేయాలనే సంకల్పంతోనే ఈ హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని కల్పించారన్నారు.

పోలీస్ స్పందనకు 33 ఫిర్యాదులు

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 33 ఫిర్యాదులందాయి. ఎస్పీ సతీష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశాలిచ్చారు.

జోరుగా కేబుల్ ఆపరేటర్ల రిజిస్ట్రేషన్లు

సామర్లకోట: కేబుల్ ఆపరేటర్ల పోస్టల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ హెడ్ పోస్టాఫీసులో సోమవారం జోరుగా సాగింది. కాకినాడ జిల్లా కేబుల్ ఆపరేటర్ల సంఘ ప్రతినిధులు బండారు కృష్ణమూర్తి, అడపా వెంకట్రావు ఆధ్వర్యంలో పోస్టల్ అధికారుల సమన్వయంతో రిజిస్ట్రేషన్లు నిర్వహించారు. సోమవారం 150 దరఖాస్తులు వచ్చాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొన్ని నిబంధనలను సడలించి, పోస్టల్ అధికారులు ఆపరేటర్ల వినతిని అంగీకరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. సామర్లకోట, తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం, గొల్లప్రోలు, శంఖవరం, కిర్లంపూడి మండలాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు. హెడ్ పోస్టుమాస్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మంగళవారం కూడా సేవలందిస్తామన్నారు.